వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దపల్లి, అక్టోబర్1: వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని వృద్ధులకు ఐడీ కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్, వృద్ధులు, వృద్ధుల ఆశ్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానలో ప్రసవాలకు సంపూర్ణ వైద్యసేవలు

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 1: ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలకు సంపూర్ణ వైద్య సేవలు అందుతున్నాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లిలోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గర్భం దాల్చినప్పటి నుంచి పిల్లల ఎదుగుదల వరకు ఎంసీహెచ్ ద్వారా సంపూర్ణ వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు . సెప్టెంబర్‌లో మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో 203 ప్రసవాలు చేసినట్లు తెలిపారు. ఆర్థోపెడిక్‌కు సంబంధించి 39 మేజర్ సర్జరీలు చేశారని వెల్లడించారు. ఆరు నెలల్లో దాదాపు 130 ప్రసవాలు జరిగాయని, ఆగస్టులో 198, సెప్టెంబర్‌లో 203 ప్రసవాలు చేశారని తెతెలిపారు. ఇందుకు కృషి చేసిన సూపరింటెండెంట్ శ్రీధర్, వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. జిల్లా దవాఖానలో నూతనంగా 8 మంది వైద్యులు చేరడంతో ప్రతి విభాగంలో అవసరమైన సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక్కడ డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఆర్ఎంవో రవీందర్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

ఓదెల, అక్టోబర్ 1: పొత్కపల్లికి చెందిన గీత కార్మికుడు నగునూరి శ్రీనివాస్‌గౌడ్ ఈత చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈతచెట్టు ఎక్కగా మోకు జారడంతో కింద పడ్డాడు. బాధితుడిని వెంటనే 108లో కరీంనగర్ దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో, TEAM-LEADERSగా జగిత్యాల మరియు చుట్టు ప్రక్క ప్రాంతాలలో పనిచేయుటకు M/F కావలెను. Q: 10th ఆపైన. సెల్: 93930 55164.
NTK-335257
PLOTS FOR SALE
★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

సుల్తానాబాద్: అల్ఫోర్స్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న టీచర్లు, విద్యార్థినులు

జ్యోతినగర్ : విశ్వభారతిలో లింగాకృతి బతుకమ్మతో పాఠశాల నిర్వాహకులు

ధర్మారం: దుర్గాదేవి వేషధారణలో బ్రిలియంట్ మోడల్ హైస్కూల్ విద్యార్థినులు

ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు

సుల్తానాబాద్/సుల్తానాబాద్ రూరల్, అక్టోబర్ 1 : జిల్లాలోని పలు ప్రభు త్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి తీసుకువచ్చారు. ఒక్కచోట పెట్టి టీచర్లు, విద్యార్థినులు ఆడిపాడారు. సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత వీ నరేందర్‌రెడ్డి పండుగు విశిష్టతను విద్యార్థులకు వివరించారు. గర్రెపల్లిలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో, మోడల్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ గోల్డీ బల్బీర్ కౌర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అరుణ గౌరమ్మ పూజ చేశారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎం దుగ్యాల శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలత పాల్గొన్నారు

ఓదెల మండలంలో..

ఓదెల, అక్టోబర్ 1: కొలనూర్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో డీజే సౌండ్స్ మధ్యన బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్1:మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జూలపల్లి మండలంలో..

జూలపల్లి, అక్టోబర్ 1 : జూలపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. జూపిటర్, న్యూ బ్రిలియంట్ విద్యా సంస్థల్లో

మంథని : కాకతీయ స్కూల్‌లో బతుకమ్మలతో టీచర్లు, విద్యార్థినులు

బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి వాగులు, కాల్వలు, చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఇక్కడ హెచ్‌ఎంలు సరస్వతి, లక్ష్మణ్, కరస్పాండెంట్లు అందె కుమారస్వామి, కొండ సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రినిటీ, మదర్‌థెరిస్సాలో..

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 1: కాసులపల్లిలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలు జరిపారు. హెచ్‌ఎం అడుప బాపురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.పెద్దబొంకూర్‌లోని మదర్‌థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. బతుకమ్మ పండుగపై పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అడవల్లి

పెద్దపల్లి రూరల్: ట్రినిటీ స్కూల్ బతుకమ్మలతో టీచర్లు, విద్యార్థినులు

నవత, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, హెచ్‌వోడీలు అర్షియ, నవ్య, ఫాతిమా, శ్రావణి పాల్గొన్నారు.

విశ్వభారతిలో..

జ్యోతినగర్, అక్టోబర్ 1: రామగుండం, ఎన్టీపీసీలోని విశ్వభారతి విద్యాసంస్థల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎన్టీపీసీలోని విశ్వభారతి పాఠశాలలో చైర్మన్ బంధారపు యాదగిరిగౌడ్ వేడుకలను ప్రారంభించారు. శివలింగం ఆకారంలో ప్రత్యేకంగా అలంకరించిన భారీ బతుకమ్మ ఆకట్టుకుంది. ఇక్కడ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం తిరుపతిగౌడ్, నవోదయ, సెయింట్ జోసెఫ్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.

'ఇండో అమెరికన్'లో

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 1: గోదావరిఖని ఎల్‌బీ నగర్‌లోని ఇండో అమెరికన్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను డైరెక్టర్ హేమలత శ్రీకాంత్ ప్రారంభించారు. ఆట..పాటలతో హోరెత్తించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, టీచర్లు, పాల్గొన్నారు. గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ముందుస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించగా ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్‌కుమార్, డాక్టర్ రవి రమేశ్‌రెడ్డి, అజయ్‌కుమార్, సావిత్రి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై ప్రసాద్ ఉన్నారు. ఎల్కలపల్లి యూపీఎస్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఎంఈవో విమల పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఇక్కడ హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాలకుర్తి మండలంలో..

పాలకుర్తి, అక్టోబర్1: మండలంలోని యూనివర్సల్, ఐఎంఎస్ఎస్, ఆలీవర్, గ్లోబల్, జెమ్స్ తదితర ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు అలరించాయి.

కాకతీయలో ..

మంథని, అక్టోబర్1: పట్టణంలోని కాకతీయ ఇంగ్లిష్ మీడియం, కృష్ణవేణి పాఠశాలల్లో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ సంబురాలు అలరించాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీరాంభట్ల సంతోషిణి, పాఠశాలల డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, స్రవంతి, పావని, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రగతి పాఠశాలలో...

రామగిరి, అక్టోబర్ 1: ప్రగతి పాఠశాలలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకల్లో కరస్పాండెంట్ కేశవరెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్తారంలో..

ముత్తారం, అక్టోబర్ 1: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలు ఆకట్టుకున్నాయి.

ధర్మారం మండలంలో..

ధర్మారం,అక్టోబర్1: ధర్మారంలోని బ్రిలియంట్ మోడల్ ఉన్నత పాఠశాలలో చైర్మన్ సిరిపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలు జరిపారు. విద్యార్థినులు దుర్గాదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు. స్మార్ట్ కిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థినులు,ఉపాధ్యాయులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. హెచ్‌ఎం బుధారపు రమాదేవి, కరస్పాండెంట్ బుధారపు మహేందర్ పాల్గొన్నారు. సాందీపని ప్లే స్కూల్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో హెచ్‌ఎం పాములపర్తి శ్రీనివాస్, కరస్పాండెంట్ పూస్కూరు రామారావు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆర్జీ-1 బ్రాంచి కమిటీ ఎన్నిక

టీబీజీకేఎస్ నూతన బ్రాంచి కమిటీ సభ్యులు

గోదావరిఖని, అక్టోబర్ 1: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు సింగరేణి ఆర్జీ-1 ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచి కమిటీని మంగళవారం టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. బ్రాంచీ సెక్రటరీలుగా దూట శేషగిరి, వాసర్ల జోసఫ్, కొంండ్ర అంజయ్య, సాయిచరణ్, మహేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కళాధర్‌రెడ్డి, కోయ్యడ రమేశ్, మీస రాజు, కరాటే రాములు, తాటికంటి తిరుపతి, కోశాధికారిగా పర్ల పల్లి అభిషేక్, సంయుక్త కార్యదర్శులుగా గండు శ్రావణ్, పల్లె సురేందర్, చుక్కల శ్రీనివాస్, బొల్లం సత్యనారాయణ, ఎండీ ఆరిఫ్ ఉన్నారు. ఇక్కడ టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి, సీనియర్ వైఎస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, జాయింట్ సెక్రటరీ చెల్పూరి సతీశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పొలాడి శ్రీనివాసరావు, మొదంపల్లి రాజేశం, రోడ్డసంపత్, అడ్డగట్ల గోపి, పుల్కాక శంకర్, వెంబడి సుధాకర్, పుప్పాల రవీందర్,ప్రదీప్, మురళి, మార్క వెంకటస్వామి, రాంచందర్ ఉన్నారు.

కేశోరాంలో 35 మంది పర్మినెంట్


ఆర్డర్ కాపీలు అందిస్తున్న అధికారులు, యూనియన్ నాయకులు

పాలకుర్తి, అక్టోబర్1: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారంలో కాంట్రాక్టు బేసిక్‌లో పనిచేస్తున్న 35 మంది కార్మికులను పర్మినెంట్ చేస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. యూనియన్ డిమాండ్ మేరకు కార్మికులకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ పర్మినెంట్ ఉద్యోగులుగా ఆర్డర్లు జారీ చేశారు. యూనియన్ నాయకులు, యాజమాన్యం స్పందించి తమను పర్మినెంట్ చేయడం పై కాంట్రాక్టు బేసిక్ కార్మికులు సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కేశోరాం అధికారులు పార్థసారథి, సధానందం, పర్మినెంటు యూనియన్ అధ్యక్షుడు బయ్యపుమనోహర్‌రెడ్డి, వర్కింగ్‌ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి దాడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి యత్నించిన ఒకరికి జైలు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 1: ఓ మహిళపై లైంగిక దాడికి యత్నించిన కేసులో వరంగల్ జిల్లాలోని కొత్తవాడకు చెందిన బొద్దుల కిరణ్‌కు రెండున్నరేళ్ల జైలుశిక్ష విధిస్తూ గోదావరిఖని అడిషనల్ జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి టీ శ్రీనివాస్ తీర్పు వెల్లండించారు. వివరాలిలా ఉన్నాయి.

గోదావరిఖని తిరుమల్‌నగర్‌లో 2020 ఫిబ్రవరి 2న బాధిత మహిళ భర్త, కొడుకు ఇంట్లో లేని సమయంలో ఆమెకు వరుసకు మరిది అయిన బొద్దుల కిరణ్ లైంగిక దాడికి యత్నించాడు. అతని నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఆమెపై కిరణ్ దాడి చేయగా గాయాలయ్యాయి. బాధితురాలు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ మహేందర్ కేసునమోదు చేశారు. మరో సీఐ పర్స రమేశ్ విచారణ చేసి నివేదిక కోర్టులో దాఖలు చేశారు. కోర్టు లైజన్ ఆఫీసర్ హెడ్‌కానిస్టేబుల్ కొత్తకొండ శంకర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ టీ జ్యోతిరెడ్డి , అడిషనల్ జిల్లా, సెషన్స్ కోర్టు సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. న్యాయమూర్తి నిందితుడికి రెండున్నర సంవత్సరాల జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. నింది తుడికి శిక్ష విధించడంలో కృషిచేసిన వన్‌టౌన్ సీఐ ఇంద్ర సేనా రెడ్డి, కోర్టుడ్యూటీ ఆఫీసర్ శంకర్‌ను రామగుండం సీపీ ఎం శ్రీని వాస్, పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ అభినందించారు.

సింగరేణిలో మితిమీరిన కాంగ్రెస్ జోక్యం

గోదావరిఖని, అక్టోబర్ 1: కాంగ్రెస్ అధికారంలో వచ్చాక సింగరేణిలో గతంకంటే రాజకీయ జోక్యం మితిమీరిందన్నారు. ఏఐటీయూసీ అని గుర్తింపు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘానికి ప్రాధాన్యత ఇవ్వకుండాయాజమాన్యం అవినీతికి తెరలేపిందని ఆరోపించారు. ఏఐటీయూసీ పోరా ట ఫలితంగానే లాభాల వాటా, దీపావళి బోనస్ సాధ్యమైం దన్నారు. లాభాల్లో వాటా ప్రకటనపై కొన్ని సంఘాలు ఏఐటీయూసీపై విమర్శలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. సింగరేణిలో బడాఖానా పేరు తో కార్మికుల వేతనాల నుంచి ఎలాంటి డబ్బులు రికవరీ చేయొద్దని, యాజమాన్యమే కంపెనీకి వచ్చిన లాభాల్లో నుంచి బడాఖానా ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శిలు కే సారయ్య, వైవీ రావు, మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోశం ఉన్నారు.

11ఏ గనిలో గేట్‌మీటింగ్

జీడీకే 11ఏ గనిలో ఏఐటీయూసీ నిర్వహించిన గేట్ మీటింగ్ లో వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడారు. నాయకులు ఎల్లాగౌడ్, ఆరెల్లి పోశం, ఎం సంపత్, ఎంఏ గౌస్, రాజు, తదితరులు ఉన్నారు.

లాభాల వాటాపై తప్పుడు ప్రచారం

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 1: కొన్ని సంఘాలు తమ పబ్బం గడుపుకోవడానికి లాభాల వాటాపై తప్పుడు ప్రచారం చేస్తున్నా యని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఓసీపీ-3 కృషి భవన్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో

గోదావరిఖని : మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆయన మాట్లాడారు. కార్యదర్శి రాజయ్య, కే.రాజారత్నం, రవీందర్, అన్నారావు, రవికుమార్, శంకర్, మహేందర్, కుమారస్వామి, రవీందర్, సదయ్య, ధనుంజయ్ పాల్గొన్నారు.

లాభాల వాటా ఘనత మాదే..

రామగిరి, అక్టోబర్ 1: సింగరేణి సంస్థలోనే మొట్టమొదటిసారిగా లాభాల వాటా 10 శాతం ఇప్పించిన ఘనత ఏఐటీయూసీదేనని ఆ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సారయ్య అన్నారు. ఏఎల్‌పీ, ఓసీపీ-1 బేస్ వర్క్‌షాపులలో వేర్వేరుగా జరిగిన గేట్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. 33 శాతం లాభా ల వాటా పెంపునకు కృషి చేసింది తామేనన్నారు. కే.సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు వైవి రావు, జూపాక రాంచందర్, డీటీ రావు, ఎంఆర్‌సీ రెడ్డి, కుమార్, కేత శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సలీం, రమేష్, శ్రీనివాస్, సుధాకర్, అమరేందర్, పూర్ణాకర్ తదితరులున్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

గోదావరిఖని, అక్టోబర్ 1: సింగరేణి ఆర్జీ-1వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన బాస్కెట్‌బాల్ క్రీడా ఉద్యోగుల పోటీలను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పోటీలో ఆర్జీ-1, ఆర్జీ-2 ఉద్యోగుల తలపడ్డారు. ఇక్కడ ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచీ సెక్రటరీ ఆరెల్లి పోశం, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏరియా స్పోర్ట్సు అండ్ గేమ్స్ కార్యదర్శి బంగారు సారంగపాణి, సీఎంఓఏఐ ప్రతినిధి క్రాంతికుమార్, స్పోర్ట్సు సూపర్‌వైజర్స్ రమేశ్, నరేందర్ రెడ్డి, కోఆర్డినేటర్ సంతోష్‌రెడ్డి, కోచ్‌లు ఉన్నారు.

మిషన్ భగీరథ సిబ్బంది నిరసన

అంతర్గాం, అక్టోబర్ 1: నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదంటూ మిషన్ భగీరథ సిబ్బంది నిరసన తెలిపారు. ముర్మూరులోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం వద్ద పని చేస్తున్న సిబ్బంది మంగళవారం కేంద్రం బయట నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వాలని కోరితే డ్యూటీలకు రావొద్దంటూ దబాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దసరా పండుగకు కూడా తాము పస్తులు ఉండడమేనా అని ప్రశ్నించారు. జీతాలు చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

మారుపేర్ల కేసులు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న డిపెండెంట్లు

రామగిరి, అక్టోబర్ 1: సింగరేణిలో మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసులు పరిష్కరించాలని డిపెండెంట్లు డిమాండ్ చేశారు. ఆర్జీ-3 ఏరియా జీఎం కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. డిపెండెంట్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటే విజిలెన్స్ అధికారులు మారుపేర్లపై ఉద్యోగం చేశారని, రెండు పేర్లు ఉన్నాయనే కారణంతో ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మారుపేర్ల సమస్యను పరిష్కరిస్తామని యాజమాన్యం, జాతీయ సంఘాలతో కలిసి లేబర్ కమిషనర్ ఒప్పందం కూడా చేసుకుందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం సానుకూల దృక్పథంతో ఆలోచించి ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

దసరా అడ్వాన్స్ చెల్లించాలి

కోల్‌సిటీ,అక్టోబర్ 1: రామగుండం నగర పాలక సంస్థలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దసరా అడ్వాన్స్ రూ.10వేలు చెల్లించేలా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, ఇన్‌చార్జి కమిషనర్ అరుణ శ్రీ చొరవ చూపాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ మద్దెల దినేశ్, నగర కార్యదర్శి ఎర్రల రాజయ్య కోరారు. పే స్లిప్ ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. గ్రూప్ సొసైటీ నిధులు ప్రతి కార్మికునికి లెక్క చెప్పి ఎన్నికలు నిర్వహించాలన్నారు. గత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు దసరా అడ్వాన్స్ చెల్లించిందని గుర్తు చేశారు.

దీపావళి బోనస్ చెల్లించాలని వినతి

పాలకుర్తి,అక్టోబర్1: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం పర్మినెంటు కార్మికులు, ట్రైనింగ్, బేసిక్ కార్మికులందరికి దీపావళి బోనస్ సకాలంలో చెల్లించాలని యూనియన్ నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. యాజమాన్యం ఏటా చెల్లించే దీపావళి బోనస్ ఈఏడాది ముందుగానే చెల్లించాలని యూనియన్ అధ్యక్షుడు బయ్యపుమనోహర్‌రెడ్డి, వర్కింగ్‌ప్రెసిడెంట్ పర్శవేణిశ్రీనివాస్, ప్రధానకార్యదర్శి దాడి మహేశ్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

సీబీఎస్ఈ ఏర్పాట్లపై సమీక్ష

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 1ః సింగరేణి ఆర్జీ-2 ఏరియా సెక్టార్-3 పాఠశాలలో ప్రారంభించనున్న సీబీఎస్ఈ సెలబస్ కోసం పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్సనల్ జీఎం నికోసాల్, ఈ అండ్ ఎం జీఎం జేసురత్నంలు మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక జీఎం సూర్యనారాయణతో కలిసి సమావేశమై పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ అనుమతుల నిమిత్తం చేస్తున్న పనుల పురోగతిపై సమీక్షించారు. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా పాఠశాలను తీర్చిదిద్దాలని, అత్యున్నత విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా పనులు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీజీఎం ఎర్రన్న, కరస్పాండెంట్ అనిల్‌కుమార్, ధనుంజయ, హెచ్‌ఎం సుందర్‌రావు పాల్గొన్నారు.

నిషేధాజ్ఞల కొనసాగింపు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 1: సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు సీపీ శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అలాగే డీజే, డ్రోన్‌లపై ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 1 నుంచి నవంబర్ 1వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలి

● బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించిన జీఎంలు

గోదావరిఖని/యైటింక్లయిన్ కాలనీ/రామగిరి అక్టోబర్ 1: నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని జీఎంలు సూచించారు. గడిచిన నెల బొగ్గు ఉత్పత్తి వివరాలను మంగళవారం వెల్లడించారు. రామగుండం డివిజన్ -1 పరిధిలో 82శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. సెప్టెంబర్‌లో 3,64,000 టన్నుల టక్ష్యానికి గాను 2,99,311 టన్నులతో 82శాతం సాధించిందన్నారు. ఓబీ పనులు నిర్వహించే పీసీ పటేల్ కంపెనీలో స్థానికులకు త్వరలోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు 5లో 2. 50లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2,26,264 టన్నులతో 91శాతం సాధించినట్లు తెలిపారు. మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాంతంలో 500మెగావాట్ల జల విద్యుత్‌ను కేంద్రం ఏర్పాటు చేసేందుకు సర్వే పూర్తయిందన్నారు. రామగుండంలో మూతపడిన బీ థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో సింగరేణి, జెన్‌కో ఆధ్వర్యంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం స్థాపనకు పనులు సాగుతున్నాయని వెల్లడించారు. ఇక్కడ పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఏజీఎం ఈహెడ్ ఎం దాసరి వెంకటేశ్వర్‌రావు, ఏజీఎం ఐఈడీ అంజనేయులు, తదితరులు ఉన్నారు.

ఆర్జీ-2లో 59 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి ఆర్జీ-2 ఏరియాలో 59 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ వెల్లడించారు. 9 లక్షల టన్నుల నిర్దేశిత లక్ష్యానికి గాను కేవలం 5,30,075 టన్నులు వెలికితీసి 59 శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఓబీ తొలగింపు లక్ష్యాలలో 32,44,000 క్యూబిక్ మీటర్లకు గాను 15,30,212 క్యూబిక్ మీటర్లతో 47 శాతం సాధించినట్లు తెలిపారు. 2023-24లో వచ్చిన లాభాల్లో వాటాను ఉద్యోగులకు ఇచ్చేందుకు యాజమాన్యం ప్రకటించినట్లు తెలిపారు. ఈసారి కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటాను 5వేలుగా ప్రకటించిందన్నారు. సమావేశంలో ఎస్‌వోటు జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం అనిల్‌కుమార్, వెంకట రామచంద్ర, రాజన్న, సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్ పాల్గొన్నారు.

ఆర్జీ-3లో 84 శాతం

ఆర్జీ-3 ఏరియాలో గత నెలలో 84 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం ఎన్ సుధాకర్ రావు తెలిపారు. ఆర్జీ-3 ఏరియాకు నిర్దేశించిన 4.74 లక్షల టన్నుల నిర్దేశిత లక్ష్యానికి గాను 3.99 లక్షల టన్నులు వెలికితీసి 84 శాతం చేరుకున్నట్లు తెలిపారు. ఓవర్ బర్డెన్ 38.30 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి 30.29 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసి 79శాతం చేరుకున్నట్లు తెలిపారు. 5.14 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. ఓసీపీ-1 గనికి గత మాసంలో నిర్దేశించిన 2.74 లక్షల టన్నుల లక్ష్యానికి 2.21 లక్షల టన్నులతో 81 శాతం, ఓసీపీ-2లో నిర్దేశిత 2లక్షల టన్నుల లక్ష్యానికి 1.78 లక్షల టన్నులతో 89 శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రక్షణతో కూడిన ఉత్పత్తికి సహకరిస్తూ వార్షిక లక్ష్యాలను అధిగమించాలన్నారు.

ఏపీఏ ఏరియాలో 76 శాతం

ఏపీఏ ఏరియాలో సెప్టెంబర్‌లో 76 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం కే.వెంకటేశ్వర్లు తెలిపారు. 0.17 లక్షల టన్నుల లక్ష్యానికి 0.13 లక్షల టన్నులు వెలికితీసినట్లు తెలిపారు. 0.16 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

గోదావరిఖని, అక్టోబర్ 1: ఆర్జీ-1 సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సింగరేణి సేవా భవన్‌లో ఏర్పాటు చేసిన వివిధ వృత్తిశిక్షణ తరగతులను అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఇక్కడ ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ అరెల్లి పోశం, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, లేడీస్‌క్లబ్ సెక్రటరీ చిలుక లక్ష్మీ, సేవా సమితి కోఆర్డినేటర్ నగునూరి రవికుమార్, సభ్యులు ఉన్నారు.

చిల్లపల్లిలో పర్యటించిన డీఎల్పీవో

మంథని రూరల్, అక్టోబర్1: మండలంలోని చిల్లపల్లి గ్రామంలో డీఎల్‌పీవో సతీశ్ కుమార్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం శ్మశాన వాటిక, వాటర్ ట్యాంకు, చెత్త సేకరణ తీరు, గ్రామంలో ఉన్న పలు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శికి పలు సూచనలు చేశారు. నిత్యం ఇంటింటా చెత్త సేకరణ చేయాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను సైతం పక్కాగా అమలు చేయాలన్నారు. దోమలు పెరగకుండా బ్లీచింగ్ చేయించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి రాంకిశోర్ ఉన్నారు.